విశాలాంధ్ర కృష్ణా జిల్లా

సతీసహగమనాన్ని వ్యతిరేకించిన జ్యోతిరావుపూలే

విశాలాంధ్రబ్యూరో-మచిలీపట్నం : సతీసహగమనాన్ని, స్త్రీ శిరోముండనాన్ని వ్యతిరేకించిన మొట్టమొదటిభారతీయుడు జ్యోతిరావుపూలేఅని కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. మహాత్మ జ్యోతిబాపూలే జయంతిని పురస్కరించుకొని గురువారం కలెక్టరేట్ ఆవరణలో గల జిల్లా బీసీ సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయంలో జిల్లా కలెక్టర్ డి.కె బాలాజీ మహాత్మ జ్యోతిబాపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజికమార్పుకుస్త్రీవిద్య అవసరంఅనిగుర్తించి, వారికోసం పాఠశాలలునిర్మించి, మహిళల హక్కుల కోసంపోరాడటమే కాకుండా, శూద్రులు, అగ్రవర్ణాల వారి దోపిడీకి గురికాకుండా సమ సమాజ స్థాపనకు పిలుపునిచ్చిన గొప్ప వ్యక్తి మహాత్మ జ్యోతిరావు పూలే అన్నారు.సామాజిక ఆర్థిక అసమానతలను రూపుమాపటానికి సత్యశోధక్ సమాజ్ ను స్థాపించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ కే చంద్రశేఖర రావు, జిల్లా బీసీ సంక్షేమ సాధికారత అధికారి జి రమేష్, జిల్లా దివ్యాంగుల సంక్షేమ వృద్ధుల సంక్షేమ శాఖ అధికారి కామరాజు, కలెక్టరేట్ ఏవో నాంచారయ్య, హాస్టల్ సంక్షేమ అధికారులు, సంక్షేమ శాఖల కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధిహామీ పథకం పనుల తనిఖీ

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలం పెదపూడి గ్రామంలో గురువారం నిర్వహిస్తున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను ఇంజనీరింగ్ కన్సల్టెంట్ (ఈసీ) కె.వి.శేషు పరిశీలించారు.ఆ పంచాయతీ పరిధిలోని మురుగు కాలవపూడిక పనులను 25 గ్రూపుల నుంచి దరిదాపు 400 మంది పని చేశారు. ఈ సందర్భంగా పనికి వచ్చిన కూలీల హాజరునుపరిశీలించి ఎఫ్.ఎ.చిగురుపల్లి ఏడుకొండలు నుంచి దీనికి సంబంధించిన వివరాలను సేకరించి నమోదు చేసుకున్నారు. కాగా మండలంలోని 21 గ్రామాలలో 5000 మందికి పైగా కూలీలు పనిచేసినట్లు సమాచారం.

పాడి రైతులకు ప్రోత్సాహక బోనస్

విశాలాంధ్ర-కూచిపూడి : కృష్ణామిల్క్ యూనియన్ ఆధ్వర్యంలో గత ఏడాది డిసెంబర్ ఒకటి నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు నాలుగు నెలల కాలానికి పాడి రైతులకు రూపాయికి పది పైసలు చొప్పున ప్రోత్సాహక బోనస్. తన పరిధిలోని 33 పాల సొసైటీలకు 26,97,972 రూపాయలను విడుదల చేసినట్లు మొవ్వ, వీరంకిలాకుహెడ్ క్వార్టర్స్ సూపర్వైజర్ కైలా రమేష్ గురువారం తెలిపారు. ఉగాది సందర్భంగా నూతన తెలుగు సంవత్సర కానుకగా పాడి రైతులను ప్రోత్సహించేందుకు వీరంకిలాకుహెడ్ క్వార్టర్స్ పరిధిలోని 20 సొసైటీలకు 16, 63, 935 రూపాయలు, మొవ్వ హెడ్ వాటర్ పరిధిలోని 13 సొసైటీలకు 10,26,037 రూపాయలుమంజూరైనాయని చెక్కులను తయారుచేసి ఆయా కేంద్రాలకు అందజేస్తామని వివరించారు. దీనిలో భాగంగా మొవ్వ ప్రధాన కేంద్రంలోగల మొవ్వ సొసైటీకి అత్యధికంగా 1,96,512 రూపాయలు రాగా తక్కువగా భట్లపెనుమర్రు-బి సొసైటీకి.27,808రూపాయలు విడుదలైనాయని వివరించారు. మహిళల పాలనలో గల కూచిపూడి సొసైటీకి రూ.31,212 మంజూరైనట్లు వివరించారు.

మద్యం పట్టివేత

విశాలాంధ్ర-గుడివాడ : అక్రమ మద్యని అమ్మకాలు నిర్వహిస్తున్న వక్తిని 2టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకుని అతని వద్ద ఉన్న 26 బాటిలను సీజ్ చేశారు. గురువారం స్థానిక 2టౌన్ పోలీలు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్లు సమావేశంలో 2టౌన్ సిఐ ఎం.ఎన్ దుర్గారావు మాట్లాడుతూ డియస్పి అదేశాల మేరకు స్థానిక రైల్వే ఓవర్ బ్రిడ్జి డౌన్ వద్ద అక్రమంగా మద్యం అమ్ముతున్నట్లు సమాచారం రావడం జరిగిందన్నారు. స్టేషన్ ఎస్.నాగరాజుతో కలసి పోలీసు సిబ్బంది పోతురాజు సుదర్శనకుమార్ వద్ద ఉన్న 26 క్వార్టర్స్ మద్యం బాటిల్స్‌ను పట్టుకుని అరెస్టు చేసి కేసు నమోదు చేయడం జరిగిందన్నారు.

ఘనంగా ఈద్-ఉల్-పితర్

విశాలాంధ్ర-గుడివాడ : ముస్లింల అత్యంత పవిత్ర పర్వదినమైన ఈద్-ఉల్-పితర్ (రంజాన్)ను పట్టణంలో వాడవాడలా ఘనంగా నిర్వహించారు. గురువారం ఉదయం నుండి ముస్లిం సోదరులు ఒకరికి ఒకరు ఆలింగనం చేసుకుంటూ రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. స్థానిక ఒన్‌టౌన్ పోలీసుస్టేషన్ ఎదురుగా గల గుల్జార్ చౌక్ మసీదు, బంటుమిల్లిరోడ్‌లోని మియాఖాన్ మసీదు, షాహీ మసీదు, నైజాంపేట, గుంటూరు మహల్లా, ముబారక్ సెంటర్, కార్మికనగర్, రూరల్ మండలంలోని కొత్త మల్లాయిపాలెం, పాత మల్లాయిపాలెం, తదితర ప్రాంతాలలో ముస్లింలు ఇమామ్‌ల ఆధ్వర్యంలో ప్రత్యేక

ప్రార్ధనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని), టిడిపి అభ్యర్థి వెనిగండ్ల రాము, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, పలువురు ముస్లిం సహోదరులు, రాష్ట్రం సుభిక్షంగా, సుఖశాంతులతో వర్థిల్లాలని అల్లాను వేడుకున్నారు. అనంతరం పలువురు పెద్దలు మాట్లాడుతూ రమజాన్ మాసం ఖుర్ఆన్ అవతరించిన మాసం, నిగ్రహం, భక్తి, ధర్మనిష్ట, పాపభీతి, పరామర్శించడం, దయ, కరుణ, ప్రేమానురాగాలు, ఉపకారం, మేలు కోరడం, మానవ సేవ, దైవమార్గంలో స్థిరంగా ఉండటం, ఐక్యత, ఉత్సాహం అల్లాహ్, మహాప్రవక్త(స)తో అత్యంత సాన్నిహిత్యాన్ని పెంపొందించుకున్నది రంజాన్ మాసమన్నారు. అనంతరం పేదలకు 2.5కిలోల గోధుములు లేదా రూ.56లు పితర్ (వితరణ)గా పంపిణీ చేసారు. ఈ కార్యక్రమలలో పలువురు నాయకులు, పార్టీల పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి పట్టణ అధ్యక్షుడు రామదాసు రాజీనామా?

విశాలాంధ్ర-అవనిగడ్డ : వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులుగా అన్నపరెడ్డి రామదాసు ఆ పార్టీకి రాజీనామా చేసి జనసేన పార్టీలో చేరేందుకు సమాయత్తం అయ్యారు. జనసేన పార్టీ మచిలీపట్నం ఉమ్మడి పార్లమెంట్ అభ్యర్థి వల్లభనేని బాలశౌరి కుమారుడు అనుదీప్ జనసేన పార్టీ అవనిగడ్డ అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి మండలి బుద్ధప్రసాద్ తనయుడు మండలి వెంకట్రామ్ తెలుగుదేశం, జనసేన మండల పార్టీ అధ్యక్షులు యాసం చిట్టిబాబు, గుడివాకశేషుబాబుల ఆధ్వర్యంలో అవనిగడ్డ పట్టణ పార్టీ అధ్యక్షులు, లంకమ్మ అమ్మవారి దేవస్థాన పాలక మండలి చైర్మన్ అన్నపరెడ్డి రామదాసు, పసుపులేని సత్యకిరణ్ మిత్ర బృందం ఆధ్వర్యంలో బుధవారం రాత్రి ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి విచ్చేసిన అతిథులకు పెద్దలు, యువత సాధర స్వాగతం పలికి సత్కరించారు. పెద్దలు, యువత జనసేన పార్టీకి అండగా ఉంటామని వల్లభనేని, మండలి విజయానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

విశాలాంధ్ర-చల్లపల్లి : శ్రీ చైతన్య స్కూల్ లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించారు ఐదో తరగతి పూర్తి అవుతున్న విద్యార్థులకు గోల్డ్ మెడల్, సర్టిఫికెట్, ప్రమోషన్ పట్టాలతో విద్యార్థులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యమంలో జడ్పిటిసి రాజులపాటి కల్యాణి ముఖ్య అతిథిగా విచ్చేసి విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించడంతో పాటుగా వారి సృజనాత్మకశక్తిని పెంపొందించడానికి శ్రీచైతన్య విద్యాసంస్థలు అవలంభిస్తున్న విద్యావిధానం అభినందనీయమని అన్నారు. ఈ వేసవి కాలంలో తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే తగు జాగ్రత్తలతో ఇంటి నుండి బయటకు వెళ్ళాలని తల్లిదండ్రులకు, విద్యార్థులకు సూచించారు. ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్ ఫైనల్ లెవెల్ లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డి. సురేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజల చేతిలో బ్రహ్మాస్త్రం సి-విజిల్

- -ఎంసీసీ ఉల్లంఘనలపై ఫిర్యాదు చేయవచ్చు
- -డబ్బు, మద్యం పంపిణీ,తదితర వాటిపైన ఘటనలు
- -చిత్రీకరించి యాప్ ద్వారా పంపాలి
- -ఫిర్యాదు చేసిన 100 నిమిషాల్లో చర్యలు

విశాలాంధ్ర - విజయవాడ (వన్‌టౌన్) : ఎన్నికల సందర్భంగా జరిగే అక్రమాలు నిరోధించ డానికి ప్రజలు పాలనా యంత్రాంగాన్ని అప్రమత్తం చేసేందుకు పంపే హెచ్చరికలే సి-విజిల్ అని సి-విజిల్ జిల్లా నోడల్ అధికారి ఎన్.ఎస్. కృపావరం పేర్కొన్నారు. ఇంతవరకు జిల్లాలో సి-విజిల్ కింద 77 ఫిర్యాదులను పరిష్కరించడం జరిగిందన్నారు. జిల్లాలో సి విజిల్ ద్వారా అందే ఫిర్యాదుల పరిష్కారం పై జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ప్రతి రోజూ అధికారులతో సమీక్షిస్తూ ఫిర్యాదులు సకాలంలో పరిష్కరించేందుకు దిశ నిర్దేశం చేస్తున్నారన్నారు. ఎన్నికల్లో ప్రవర్తనా నియమావళిని (ఎంసీసీ), విచ్చలవిడిగా డబ్బు ఖర్చు పెట్టడాన్ని నిరోధించడానికి భారత ఎన్నికల కమిషన్ ప్రజల చేతికిచ్చిన బ్రహ్మాస్త్రం సి-విజిల్ అని చెప్పారు. సి విజిల్ ద్వారా ప్రజలు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ ఎన్నికలు సజావుగా జరిగేందుకు సహకరించాల్సిన ఆవశ్యకత ఉందని కమిషన్ పేర్కొంది.

డౌన్లోడ్ ఇలా...

సివిజిల్ అనేది యూజర్ ఫ్రెండ్లీ అప్లికేషన్. దీనిని గూగుల్ ప్లే స్టోర్ నుంచి లేదా https://cvigil.eci.gov.in వెబ్సైట్ నుంచి డౌన్లోడ్ చేసుకోవచ్చు. ఎన్నికల నిర్వహణ క్రమంలో జరిగే అక్రమాలను ఆపటానికి, ఫిర్యాదు చేసేందుకు ఈసీఐ, సీఈఓ, డీఈఓ, ఆర్ ల వద్దకు వెళ్లాల్సిన పనిలేదు.

అక్రమాలను రికార్డు చేసి పంపాలి

ఎన్నికల్లో జరుగుతున్న అక్రమాలను ఆండ్రాయిడ్ ఫోన్‌లో రికార్డు చేసి 'సివిజిల్' యాప్ ద్వారా పంపాలన్నారు. కచ్చితమైన ప్రాంతం గుర్తించేందుకు ఇందులో జీఐఎస్, జీపీఎస్ విధానం కూడా ఉంటుంది.

నావిగేషన్ సౌకర్యం ఉంటుంది

సి-విజిల్ ద్వారా పంపిన సమాచారం ఈసీఐ,సీఈఓ, డీఈఓ, జిల్లా కంట్రోల్ సెల్‌కు చేరగానే,క్షేత్రస్థాయి ఎంసీసీ బృందాలను అప్రమత్తం చేస్తారు. అక్రమాలు జరిగాయన్న ప్రదేశానికి క్షేత్ర స్థాయి బృందాలు కచ్చితంగా చేరుకోవడానికి నావిగేషన్ సౌకర్యం ఉంటుంది.

ఐడీ నంబరు ఇస్తారు

ఫిర్యాదుదారు పంపిన ఫిర్యాదు రిజిస్టర్ కావాలని కోరుకుంటే వారికో ఐడీ నంబరు ఇస్తారు. చిరునామా ఇవ్వని వారు చేసే ఫిర్యాదులకు ఐడీ నంబర్ ఉత్పత్తి కాదు. సి విజిల్ వినియోగించే వారు ఎంసీసీ లేదా వ్యయానికి సంబంధించిన సమాచారమే పంపాలి.

ఆధారాలతో ఫిర్యాదు

డబ్బులు, మద్యం, ఇతరత్ర వస్తువుల పంపిణీ, ఎంసీసీ ఫిర్యాదులు పంపడానికి సీ-విజిల్ వేగవం తమైన విధానం. సి-విజిల్ యాప్ ద్వారా ఆధారాలతో సహా ఫిర్యాదు చేసే అవకాశం ఉంటుంది. ఇప్పటికే స్టోర్ చేసిన మెసేజ్లు, గతంలో తీసినవీడియోలు, ఫొటోలు వంటివి సి-విజిల్ ద్వారా పంపే ఆవకాశం లేదు. గ్యాలరీ, మెమోరీస్ నుంచి పంపించే అవకాశం లేదు. సి-విజిల్ యాప్ ద్వారా తీసిన సమాచారాన్ని అదే స్మార్ట్ ఫోన్ నుంచి 5నిమిషాల్లో పంపాలి. ఫిర్యాదు కచ్చితమైనది అయి ఉండాలి.

ఖాతా క్రియేషన్ ఇలా...

భారత ఎన్నికల కమిషన్ సి-విజిల్ అకౌంట్ క్రియేట్ చేసి సీఈఓకు పంపుతారు. సీఈఓకు ఓటీపీ వస్తుంది. సీఈఓ యూజ్ లాగ్ చేసుకుని పర్యవేక్షకులకు అకౌంట్ క్రియేట్ చేస్తారు. సీఈఓనే డీఈఓలకు, ఆర్ ఓ లకు అకౌంట్ క్రియేట్ చేస్తారు. వారికి ఓటీపీ రాగానే క్షేత్ర స్థాయి సర్వైలెన్స్ బృందాలకు అకౌంట్లు క్రియేట్ చేస్తారు. పార్లమెంట్ కు , శాసన సభకు ఒకే అకౌంట్ ఉంటుంది.

ఫిర్యాదు చేయాల్సిన అంశాలు

డబ్బు పంపిణీ, కొందరు డబ్బుకు బదులు కూపన్లు ఇస్తారు. ఫలానా చోట కూపన్లు ఇచ్చి డబ్బులు, వస్తువులు తెచ్చుకోవాలంటారు. మద్యం పంపిణీ, అనుమతిలేని పోస్టర్లు, బ్యానర్ల పంపిణీ, పెయిడ్ న్యూస్, భయపెట్టడం, ప్రలోభపెట్టడం, కాన్వాయ్లో అనుమతి కన్నా ఎక్కువ వాహనాలు వెళ్లడం.ప్రభుత్వ భవనాలు, స్థలాల్లో ప్రచార సామగ్రిని ఉంచి ప్రచారం చేయడం, స్లోగన్లు రాయడం, ఓటర్లను రవాణా చేయడం. పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల లోపు ప్రచారం చేయడం. ప్రచారంలో మతాన్ని ఉపయోగించడం.ఓటింగు 48 గంటలలోపు ప్రచారం చేయడం. రాత్రి గం.10 తరువాత, ఉదయం గం.6లకు ముందు లౌడ్ స్పీకర్లు ఉపయోగించడం. సభలు, సమావేశాలకు ప్రజలను తరలించడం.

ఫిర్యాదులు ఎలా పంపాలి

అక్రమాలు జరుగుతున్న సన్నివేశాలను ఫొటో లేదా వీడియో తీయాలి. లొకేషన్ ఆన్ చేస్తే జీపీఎస్ యాక్టివేట్ అవుతుంది.నెట్ లేదా వైఫై ఆన్ చేయాలి. ప్రయాణిస్తూ ఫొటోలు, వీడియోలు తీయడం వల్ల వాస్తవ ప్రదేశం రాదు. భవనాల లోపల, చెట్ల కింద తీయకూడదు. ఫొటో లేదా వీడియో తీయగానే దానంతటదే తేదీ, సమయం రికార్డవుతాయి. ఫొటో లేదా వీడియో తీయగానే స్క్రీన్ మీద ప్రివ్యూ కనిపిస్తుంది. ఏం తీశామన్న దానిని ఒకసారి చూసి నిర్ధారించుకోవాలి. అది ఏ రకమైన ఆక్రమం అనేదాని కోసం డౌన్ లిస్ట్ చూడాలి.స్పేస్ కాలమ్ ఏ రకమైన అక్రమం అనేది క్లుప్తంగా రాయాలి. అప్లోడ్ చేసిన సమాచారం గురించి స్క్రీన్ మీద కన్ఫర్మేషన్ అడుగుతుంది. అప్లోడ్ చేసి సమాచారం ఒకసారి పరిశీలించుకుని కన్ఫర్మ్ చేస్తే అది ఫార్వర్డ్ అవుతుంది. ఫార్వర్డ్ కాగానే సబ్మిట్ సక్సెస్ అని వస్తుంది. పంపిన ఫిర్యాదు ఏ దశలో ఉందో తెలుసుకునేందుకు మెనులోకి వెళ్లి స్టేటస్ ఆప్షన్ ద్వారా తెలుసుకోవచ్చు.

కష్టజీవుల కోసం జీవితాన్ని అంకితం చేసిన సీఆర్

విశాలాంధ్ర-పెనమలూరు : భూ పోరాట యోధులు సీపీఐ అగ్రనేత చంద్ర రాజేశ్వరరావు (సీఆర్) తన జీవితాన్ని కష్టజీవుల కోసం అంకితం చేశారని సీపీఐ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. పెనమలూరు నియోజకవర్గ ఏఐటీయూసీ, సీపీఐ కృష్ణాజిల్లా సమితుల ఆధ్వర్యంలో చంద్రరాజేశ్వరరావు 30వ వర్ధంతి సభ ముప్పల జోజిబాబు అధ్యక్షతన తాడిగడప డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆటో స్టాండ్ ప్రాంగణంలో జరిగింది. ఈ సందర్భంగా చంద్ర రాజేశ్వరరావు చిత్రపటానికి ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. జమలయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సీపీఐ కృష్ణాజిల్లా కార్యదర్శి టి. తాతయ్య మాట్లాడుతూ చంద్రరాజేశ్వరరావు విద్యార్థి దశ నుంచి కమ్యూనిస్టు పార్టీకి ఆకర్షితులయ్యారని, కమ్యూనిస్టు పార్టీకి 28 సంవత్సరాలు పాటు జాతీయ కార్యదర్శిగా పనిచేశారని చెప్పారు. చల్లపల్లి జమీందారుకు వ్యతిరేక పోరాటంలో ప్రధానమైన పాత్ర పోషించి పేదలకు భూమిని పంచారన్నారు. దేశవ్యాప్తంగా జరిగిన అనేక కష్టజీవుల ఉద్యమాలకు నాయకత్వం వహించారని తెలిపారు. మే నెలలో జరగబోయే సాధారణ ఎన్నికల్లో బీజేపీ, దాని మిత్రపక్షాలను ఓడించడం ద్వారానే చంద్ర రాజేశ్వరరావుకు నిజమైన నివాళు లర్పించటమని కర్తవ్యాన్ని బోధించారు. ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. జమలయ్య మాట్లాడుతూ స్వాతంత్ర్యం, సమసమాజ నిర్మాణం కోసం వ్యక్తిగత జీవితాన్ని త్యాగం చేశారని,ఏళ్ళ తరబడి ఉద్యమంలోనూ, అజ్ఞాతవాసం గడిపారన్నారు. పేదల కోసం,అణగారిన వర్గాల కోసం పోరాటం సాగించిన యోధుడని,సైద్ధాంతిక నిబద్ధతకు నిజాయితీకి నిలువుటద్దమని, తెలంగాణ సాయుధ పోరాట యోధులతో జతకట్టి రజాకార్లకు వ్యతిరేకంగా పేదల పక్షాన నిలబడి, అణిచివేతకు, వెట్టిచాకిరికి వ్యతిరేకంగా ఉద్యమాన్ని నడిపిన మహా నాయకుడని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పెనుమలూరు నియోజకవర్గ కార్యదర్శి మున్నంగి నరసింహారావు, ఆటో వర్కర్స్ యూనియన్ కార్యదర్శి గంటా మహేష్, ఉపాధ్యక్షులు చప్పిడి జోసెఫ్,కోశాధికారి జి .రవిచంద్ర, నాయకులు మరియన్న,సురేష్, చిన్న పణి, లక్ష్మీ నరసింహ,పేట వెంకట తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూలే 198వ జయంతి



విశాలాంధ్ర-మచిలీపట్నం : అణగారిన వర్గాలకు అండగా నిలిచిన జ్యోతిరావు పూలే జయంతిని నిర్వహించడం నాకు చాలా ఆనందాన్నిచ్చిందని కృష్ణాజిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు సేకు బోయిన సుబ్రహ్మణ్యం అన్నారు. గురువారం స్థానిక ఈడేపల్లి బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో మహాత్మ జ్యోతిరావు పూలే 198 వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘ సంస్కర్త, రచయిత, సమానత్వం కోసం పోరాడిన మహనీయుడు జ్యోతిరావు పూలే అని కొనియాడారు. సామాజిక మార్పుకు స్త్రీ విద్య ఆవశ్యకతను గుర్తించి, వారికోసం పాఠశాలలు నిర్మించారని ఆయన అన్నారు. మహిళల హక్కుల కోసం పోరాడారని, శూద్రులు, అగ్ర వర్ణాల వారి వివక్షకు గురికాకుండా సమసమాజ స్థాపనకు పిలుపునిచ్చిన ఉద్యమ కారుడని ఆయన అభివర్ణించారు. సామాజిక ఆర్థిక అసమానతలను రూపుమాపడానికి "సత్యశోధక సమాజ్ "ను స్థాపించారని తెలిపారు.సతీ సహగమనం,స్త్రీ శిరోముండన్నాన్ని వ్యతిరేకించిన మహాత్ముడని శేకుబోయిన కొనియాడారు. తొలుత జ్యోతిరావు పూలే చిత్రపటానికి ఆయన పూలమాల వేశారు. ఈ కార్యక్రమంలో నిక్కు రాధాకృష్ణ,జన్ను గోవిందు,బోయిన రమేష్,ఎం. పవన్, బి. వెంకటస్వామి తదితర బీ.సీ నాయకులు పాల్గొన్నారు.

పెదపూడిలో...

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలం పెదపూడి గ్రామంలో గురువారం మహాత్మ జ్యోతిరావు గోవిందరావు పూలే 197వ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న వ్యక్తులు మాట్లాడుతూ అణగారిన కులాల ప్రజలకు విద్యను అందించడంలో ఆయన చేసిన కృషి నేడు సమాజంలో అందరూ విద్యావంతులుగా రూపొందుతున్నారని పేర్కొన్నారు. అలాగే సమాజంలో పాతుకుపోయిన అంటరానితనం, కుల వ్యవస్థ నిర్మూలనలపైపోరాటం చేసిన సంఘసంస్కర్తని పలువురు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులుతాతాశివాజీ, వీరంకితులసీదాస్, ఓరుగంటి నాగరాజు,బిజెపి నాయకులు దోనేపూడి శివరామయ్య, మదిరకిరణ్, విక్టర్ పాల్, అశోక్ కుమార్, ఓరుగంటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం సెంటర్లో మిఠాయిలు పంపిణీ చేశారు.

జయహో బీసీ సమావేశాలు జయప్రదం చేయాలి

విశాలాంధ్ర-పెదపారుపూడి : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు మండలంలో జయహెూ బిసి సభలు, సమావేశాలు నిర్వహించాలని ఆ పార్టీ బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరంకి వెంకట గురుమూర్తి అన్నారు. మండలంలోని యలమర్రు గ్రామంలో బుధవారం రాత్రి, భూషణగూళ్ల గ్రామంలో గురువారం జియహెూబిసి సమావేశాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టిడిపి, బిజెపి, జనసేన పార్టీల కూటమి పామర్రు నియోజకవర్గ ఇన్చార్జి వర్ల కుమార్ రాజా ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ విషయమై పై వ్యక్తులు మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వ హాయంలో బీసీలకు అనేక అభివృద్ధి పనులు, పథకాలు ప్రవేశపెట్టి అభివృద్ధి పథంలో నడిచిన తీరును వివరించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి, ప్రధాన కార్యదర్శి మసిముక్కు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కేసరపల్లి సొసైటీ మాజీ చైర్మన్ మూల్పూరి మృతి

విశాలాంధ్ర-గన్నవరం : కేసరపల్లి సొసైటీ మాజీ చైర్మన్ మూల్పూరి సత్యనారాయణ (101) అనారోగ్యంతో గురువారం ఉదయం మృతి చెందారు. సత్యనారాయణకు ఐదుగురు కుమారులు ఆయన గన్నవరం మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్‌గా పనిచేసారు. కాంగ్రెస్ పార్టీ మాజీ మంత్రి కాకాని వెంకటరత్నం అనుచరులుగా గుర్తింపు పొందారు. మూల్పూరి సత్యనారాయణ జీవిత కాలం కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నారు. కేసరపల్లి కాంగ్రెసు పార్టీ నాయకులు ఎవరు అంటే మూల్పూరి సత్యనారాయం గుర్తింపు పొందారు. ఆయన మృతదేహాన్ని మాజీ ఎమ్మెల్యే ముసునూరి రత్న బోసు,గన్నవరం టిడిపి ఇంచార్జి యార్లగడ్డ వెంకట్రావు, కేసరపల్లి సర్పంచి చేబ్రోలు లక్ష్మీ మౌంఇక, యంపిటిసి సభ్యులు కిషోర్, గన్నవరం వైస్ యంపీపీ శివ నాగరాజ కుమారి, గన్నవారం వైఎస్ సర్పంచి పాలడుగు నాని గన్నవరం యంపిటిసి1 సభ్యులు త్రిపురనేని బాబీ గ్రామ ప్రముఖులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఆయన అంతిమయాత్ర శుక్రవారం ఉదయం 9గంటలకు జరుగుతుందని కుమారులు తెలిపారు.

స్త్రీ విద్యకు పునాదులు వేసిన జ్యోతిరావు పూలే- కొల్లు రవీంద్ర

విశాలాంధ్ర, మచిలీపట్నంటౌన్. పురుషాధిక్య సమాజంలో అణగారిన స్త్రీలు విద్య ద్వారానే ఉన్నత స్థాయికి వస్తారని భావించి పాఠశాలలు నిర్మించి స్త్రీల ఔన్నత్యానికి పాటుపడిన వ్యక్తి మహాత్మ జ్యోతిరావు పూలే అని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు మాజీ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. గురువారం జ్యోతిరావు పూలే 196వ జయంతి సందర్భంగా జనసేన ఎంపీ అభ్యర్థి బాలశౌరి, కృష్ణాజిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కొనకళ్ళ నారాయణరావుతో కలిసి జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం ఆయన మాట్లాడుతూ సాంఘిక దురాచారాలతో ఉన్న సమాజాన్ని బాగు చేయాలంటే స్త్రీల ఔన్నత్వమే పరమావధి అని భావించి, పాఠశాలలు నిర్మించి స్త్రీల విద్యకు పాడిన పాటుపడిన మహెూన్నత వ్యక్తి జ్యోతిరావు పూలే అన్నారు. ఎంపీ బాల శౌరి మాట్లాడుతూ ఆనాటి సాంఘిక దురాచారాలైన సతీసహగమనం, స్త్రీ శిరోమండనం వంటి వాటిని వ్యతిరేకించిన గొప్ప వ్యక్తి జ్యోతిరావుపూలేఅని, అంతటి మహెూన్నత వ్యక్తి 196వ తేదీ సందర్భంగాఆయనను స్మరించుకోవడం మనందరివిధి అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇన్చార్జి బండి రామకృష్ణ, తెలుగుదేశం, జనసేన, బిజెపి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సామాజిక దార్శనికుడు పూలే... ఆళ్ల

విశాలాంధ్ర-గన్నవరం : సమ సమాజ స్థాపనకు విద్య వ్యాప్తికి మహిళా సాధికారతకు తన జీవితం అంకితం చేసిన తొలి సమాజ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే అని రాష్ట్ర టీడీపీ నేత ఆళ్ళ వెంకట గోపాల కృష్ణారావు పేర్కొన్నారు. గురువారం ఉదయం బాపులపాడు మండలం రంగన్న గూడెం గ్రామం లో రంగన్నగుడెం రూరల్ డెవలప్మెంట్ సొసైటీ (ఆర్ .ఆర్ .డి. ఎస్) అధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావు పూలే 198 వ జయంతి సందర్భంగా మహాత్మ జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆళ్ళ వెంకట గోపాల కృష్ణారావు మాట్లాడుతూ కుల,లింగ వివక్ష లేకుండా అన్ని వర్గాలకు విద్య అందించాలని, విద్య ద్వారానే బలహీన వర్గాలు సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందుతాయని నమ్మిన వ్యక్తి పూలే అని చెప్పారు. అంటరానితనం, బాల్య వివాహాలకు వ్యతిరేకంగా పోరాడిన వ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ బెజవాడ వెంకట కృష్ణారావు,ఎంపీసీఎస్ అధ్యక్షులు మొవ్వ శ్రీనివాసరావు,గ్రామ బీసీ ఫెడరేషన్ నాయకులు కొలుసు గంగాజలం,మందపాటి రాంబాబు,పల్లగాని వీరాంజనేయులు,దేవరకొండ శ్రీనివాసరావు, కైతేపల్లి రంగారావు,యడవల్లి స్వామి,మెరుగు మాల వెంకటరత్నం, నెరుసు తాతయ్య,పల్లగాని శ్రీనివాసరావు,దేవరకొండ వెంకటేశ్వరరావు,వల్లూరి గంగాధర్ రావు,నెరుసు వెంకటేశ్వరరావు,,గ్రామ బీసీ యువ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పంట కాలువలకు తాగునీరు



విశాలాంధ్ర-అవనిగడ్డ : పంట కాలువలకు తాగునీరు విడుదల చేయడంతో బుధవారం సాయంత్రం అవనిగడ్డకు పంట కాలువ ద్వారా తాగు నీరు చేరుకుంది. మోటర్లు, చమురు యంత్రాల ద్వారా తాగు నీటితో చెరువులు నింపేందుకు కార్యదర్శి తోట శ్రీనివాసరావు సర్పంచ్ గౌరుముచ్చు ఉమా ఆధ్వర్యంలో 2 మోటర్లు, 1 చమురు యంత్రాన్ని ఏర్పాటు చేసి చెరువు నింపే పనిలో నిమగ్నమయ్యారు. దివిసీమలోని పంచాయితీ కార్యదర్శులందరూ త్రాగు నీటి చెరువులను పూర్తి స్థాయిలో నింపుకోవాలని ఇప్పటికే ఉన్నత అధికారులు ఆదేశాలు జారీ చేశారు. కాలువల ద్వారా వస్తున్న త్రాగు నీటిని చేపలు, రొయ్యల చెరువులకు తరలించకూడదని, ఆవిధంగా తరలించేవారిపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు సైతం జారీ చేశారు.

విశాలాంధ్ర
ఎన్టీఆర్ జిల్లా

పశ్చిమ నియోజకవర్గ సీపీఐ అభ్యర్థి జి కోటేశ్వరరావు విజయాన్ని కాంక్షిస్తూ ఆర్ఈ క్వార్టర్స్ లో ప్రచారం చేస్తున్న స్థానిక సీపీఐ నాయకులు కార్యకర్తలు.

నూతన సమాజానికి బాటలు వేసిన పూలే: జల్లి విల్సన్

విశాలాంధ్ర-విజయవాడ: వివక్షతలతో ఉన్న వ్యవస్థ రూపురేకలు మారి అందరూ సుఖసంతోషాలతో జీవించాలనే ఆలోచనలతో నూతన సమాజానికి బాటలు వేసిన పూలే తొలి సామాజిక విప్లవకారుడని మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ అన్నారు. మహాత్మ జ్యోతిరావు పూలే 196వ జయంతి సందర్భంగా ఆయోధ్యనగర్ వద్ద ఉన్న నాయీ బ్రాహ్మణ వృత్తి విద్యా శిక్షణాలయంలో పూలే చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం జల్లి విల్సన్ మాట్లాడుతూ మానవులంతా సమాన అవకాశాలతో జీవించాలనే దృక్పథంతో ఎన్ని అవాంతరాలు ఎదురైనా పట్టుదలతో ఉద్యమాన్ని కొనసాగించారని కొనియాడారు. మహాత్మ పూలే ఆశయాలతో నేటి తరం మరింత పట్టుదలతో పోరాడాలని పిలుపునిచ్చారు. మాజీ కార్పొరేటర్ బుట్టి రాయప్ప, నాయీ బ్రాహ్మణ శిక్షణాలయం నాయకులు గోనుగుంట్ల యల్లమందారావు, ప్రకాశరావు, పాతపూడి శ్రీనివాస్, పొదిలి నాగప్రతాప్, వి.నితిన్, సీహెచ్.శ్రీనివాస్, శిణాలయ విద్యార్థులు పూలేకు నివాళులర్పించారు.

కొండ ప్రాంతంలో ఇళ్లకు పట్టా రిజిస్ట్రేషన్‌కు కృషి

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): తాను కార్పొరేటర్‌గా ఉన్న సమయంలో కార్పొరేషన్ పరిధిలోని స్థలాలను క్రమబద్ధీకరించి రిజిస్ట్రేషన్ చేయించామని, తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే కొండ ప్రాంతంలోని ప్రతి ఇంటికి పట్టా ఇప్పించి రిజిస్ట్రేషన్ చేయిస్తానని ఇండియా కూటమి బలపరిచిన సీపీఐ అభ్యర్థి జి.కోటేశ్వరరావు చెప్పారు. స్థానిక 35వ డివిజన్‌లోని ప్రతి ఇంటికి వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గం అభివృద్ధికి కమ్యూనిస్టులు ఎంతో కృషి చేశారని తెలిపారు. గతంలో కమ్యూనిస్టు పార్టీ తరపున గెలిచిన కార్పొరేటర్లు, ఎమ్మెల్యేలు నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి కృషి చేసిన విషయాన్ని నేటికీ ప్రజలు గుర్తుచేసుకుంటున్నారని చెప్పారు. ప్రస్తుతం కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని వైసీపీ ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. నగర పాలకుల వైఫల్యం వల్ల తాగునీటి సమస్య తీవ్రంగా పెరిగిపోయిందని, మంచినీటి కోసం ప్రజలు అల్లాడే పరిస్థితి వచ్చిందన్నారు. పన్నుల రూపంలో ప్రజలను దోచుకుంటున్న పాలకులు సదుపాయల కల్పనలో మాత్రంలో ఘోరంగా విఫలమయ్యారని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం కోట్ల రూపాయలను కుమ్మరించే బడా బాబులకు కాకుండా.. నిత్యం ప్రజల మధ్య ఉంటే, ఏ సమస్య వచ్చినా పిలిస్తే పలికే కమ్యూనిస్టులను గెలిపించాలని జి.కోటేశ్వరరావు కోరారు. పెజ్జోని పేట భూపేష్ గుప్తా గ్రంథాలయం వద్ద నుండి ప్రారంభమైన ప్రచార యాత్ర డివిజన్‌లోని వివిధ ప్రాంతాల మీదుగా సాగుతూ కరుణ హెూటల్ సెంటర్ వద్ద ముగిసింది. ప్రచార కార్యక్రమంలో స్థానిక సీపీఐ కార్యదర్శి పొలిమేర తాతరావు ఆధ్వక్షత వహించగా నగర సహాయ కార్యదర్శి నక్క వీరభద్రరావు, కార్యదర్శివర్గ సభ్యులు తాడి పడియ్య, కొట్టు రమణారావు, పంచదార్ల దుర్గంబ, కార్యవర్గ సభ్యులు సంగుల పెరయ్య, సింగరాజు సాంబశివరావు,వెంకటేశ్వర రావు, డివిజన్ నాయకులు రామకృష్ణ, ఖాదర్ ఖాన్,దుర్గమ్మ, లక్ష్మీ, సంజీవ రావు, సిద్దు, ప్రసాదు, రవి, ఎస్ కే బాబు, మధు, అన్వర్, సాయి, ఓదురి పద్మావతి, లక్ష్మీ, బబ్లు, వందలాది స్థానిక సీపీఐ కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

అణగారిన వర్గాల ఆద్యుడు పూలే

విశాలాంధ్ర-జగ్గయ్యపేట : పట్టణంలోని కమల థియేటర్ సెంటర్లో ఉన్న జ్యోతిరావు పూలే విగ్రహానికి తెదేపా నేతలతో కలిసి ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నెట్టెం శ్రీ రఘురామ్, మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీరాం సుబ్బారావు తదితరులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.అదేవిధంగా జగ్గయ్యపేట పట్టణంలో తె.దే.పా నేతలతో కలిసి శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) తన నివాసంలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించినారు.ఈ సందర్భంగా పెద్దలు మాట్లాడుతూ అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలనతో పాటు మహిళోద్ధరణకు జ్యోతి రావు పూలె కృషి చేసాదని అన్నారు. 1873 సెప్టెంబరు 24న, పూలే తన అనుచరులతో కలిసి, దిగువ కులాల ప్రజలకు సమాన హక్కులను పొందటానికి సత్యశోధక్ సమాజ్ (సొసైటీ ఆఫ్ సీకర్స్ ఆఫ్ ట్రూత్) ను ఏర్పాటు చేశాడని అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం పనిచేసిన ఈ సంఘంలో అన్ని మతాలు, కులాల ప్రజలు కూడా చేరేలా చర్యలు తీసుకున్నారని, సామాజిక సంస్కరణ ఉద్యమంలో పూలే ఒక ముఖ్యమైన వ్యక్తిగా పరిగణించబడ్డారని తెలిపారు. పూలే బాలికల కోసం మొదటి పాఠశాలను పూణేలో ప్రారంభించాడని, పూలే వితంతువుల కోసం ఒక గృహాన్ని కూడా స్థాపించాడని అన్నారు. భారతదేశ బాలికల కోసం ఒక పాఠశాల ప్రారంభించిన మొట్టమొదటి స్థానిక భారతీయులలో ఈ జంట ఉన్నారన్నారు. విద్య యొక్క విశ్వీకరణను సమర్థించిన మొదటి సంస్కర్త కూడా ఆయనే అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతి ఫిర్యాదుపైనా ప్రత్యేక దృష్టి

-1,142 ఫిర్యాదుల పరిష్కారం: కలెక్టర్

విశాలాంధ్ర-విజయవాడ: జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ) అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు ఓటర్ హెల్ప్‌లైన్, నేషనల్ గ్రీవెన్స్ సర్వీసెస్ పోర్టల్ (ఎన్‌జీఎస్‌పీ) తదితర మార్గాల ద్వారా 1,156 ఫిర్యాదులు రాగా 1,142 ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియ పూర్తయిందని, మిగిలినవి పురోగతిలో ఉన్నాయని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. తిరువూరు నియోజకవర్గానికి సంబంధించి 55 సీ-విజిల్ ఫిర్యాదులురాగా.. విజయవాడ పశ్చిమకు సంబంధించి 6, విజయవాడ సెంట్రల్‌కు సంబంధించి 58, విజయవాడ తూర్పునకు సంబంధించి 73, మైలవరంకు సంబంధించి 18, నందిగామకు సంబంధించి 134, జగ్గయ్యపేట నియోజకవర్గానికి సంబంధించి 103 ఫిర్యాదులు, ఇతర పోలింగ్ స్టేషన్ల పరిధి నుంచి 4 ఫిర్యాదులు వచ్చినట్లు వివరించారు. 60 ప్రతికూల వార్తలకు సంబంధించి 56 అంశాలపై తగిన చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ప్రతి ఫిర్యాదుపైనా ప్రత్యేకంగా దృష్టిసారించి నాణ్యతతో పరిష్కరిస్తున్నట్లు కలెక్టర్ ఢిల్లీరావు తెలిపారు.

రూ. 6.74 కోట్ల విలువైన నగదు, మద్యం, ఇతర వస్తువుల సీజ్:

జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని సమర్థవంతంగా అమలుచేస్తున్నామని.. అదే విధంగా సీజర్ మేనేజ్‌మెంట్ వ్యవస్థ పటిష్టంగా అమలవుతోందని, ఇప్పటి వరకు రూ. 6.74 కోట్ల విలువైన నగదు, మద్యం, మత్తు పదార్థాలు, విలువైన వస్తువులు, ఉచితాలు తదితరాలను సీజ్ చేసినట్లు కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. రూ. 3.01 కోట్ల నగదుతో పాటు రూ. 92.56 లక్షల విలువైన 19,233 లీటర్ల మద్యం, రూ. 5.91 లక్షల విలువైన 58,401 గ్రాముల మత్తు పదార్థాలు, రూ. 2.32 కోట్ల విలువైన 7,758 గ్రాముల విలువైన లోహాలు, రూ. 6.43 లక్షల విలువైన 132 ఉచితాలు తదితరాలను సీజ్ చేసినట్లు తెలిపారు. జగ్గయ్యపేట నియోజకవర్గానికి సంబంధించి రూ. 1.13 కోట్ల మేర సీజర్లు జరిగినట్లు వెల్లడించారు. అదే విధంగా మైలవరం నియోజకవర్గంలో రూ. 35.62 లక్షలు, నందిగామలో రూ. 18.33 లక్షలు, తిరువూరులో రూ. 84.57 లక్షలు, విజయవాడ సెంట్రల్‌లో రూ. 2.75 కోట్లు, విజయవాడ తూర్పులో రూ. 64.12 లక్షలు, విజయవాడ పశ్చిమలో రూ. 82.44 లక్షల మేర సీజర్లు జరిగినట్లు కలెక్టర్ ఢిల్లీరావు వివరించారు.

గొప్ప సాంఘిక సంస్కర్త.. మహాత్మ జ్యోతిరావు పూలే

సాంఘిక సంస్కర్తగా మహాత్మ జ్యోతిరావు పూలే చేసిన సేవలు చాలా గొప్పవని.. మహిళల విద్య, సామాజిక న్యాయం కోసం ఆయన ఎనలేని కృషి చేశారని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు.మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో కలెక్టర్ ఢిల్లీరావు.. జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూల మాలలు అలంకరించి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దోపిడీ, అణచివేత, వివక్షతలను ఎదుర్కొనేందుకు బడుగు బలహీన వర్గాలకు చదువు ముఖ్యమని భావించి.. విద్యను చిత్తశుద్ధితో మనోధైర్యంతో శ్రద్ధతో అభ్యసించి, ఉన్నతంగా ఎదగాలని సమాజానికి చాటిచెప్పి అందులో విజయం సాధించిన మహనీయులు జ్యోతిరావు పూలే అని పేర్కొన్నారు. ప్రజలకు సాంఘిక న్యాయం, సమాన హక్కుల కోసం సత్యశోధక సమాజాన్ని స్థాపించి చైతన్యం తెచ్చి, విశేష సేవలు అందించారని కలెక్టర్ ఢిల్లీరావు అన్నారు. కార్యక్రమంలో కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జ్యోతిరావు పూలే జయంతి

విశాలాంధ్ర-గంపలగూడెం : గంపలగూడెం మండలం పెనుగొలను లో గురువారం షిరిడి సాయిబాబా సేవా కమిటీ ఆధ్వర్యంలో సంఘసంస్కర్త జ్యోతిరావు పూలే జయంతి ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. అంటరానితనం, కుల వ్యవస్థ నిర్మూలనతోపాటు , మహిళా హక్కుల కోసం, అణగారిన వర్గాల అభివృద్ధి కోసం నిరంతరం పాటుపడిన పూలే గొప్ప మానవతావాదని ఉస్మానియా యూనివర్సిటీ విశ్రాంత ప్రొఫెసర్ రామాల. నాగేశ్వరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఎం ఈఓ.వి.శేషి రెడ్డి, కాన్వెంట్ ప్రిన్సిపాల్ తోట. నాగరాజు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. మండల కేంద్రమైన కంపలగూడెంలో భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో జ్యోతిరావు పూలే జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కే. నాగోపాలకృష్ణ, నేరెళ్ల. యుగంధర్. పాపులు. నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రంజాన్ పండుగ

విశాలాంధ్ర-కంచికచర్ల: కంచికచర్ల పరిసర ప్రాంతాలలో రంజాన్ పర్వదినాన్ని ముస్లిం సోదరులు గురువారం అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించుకున్నారు. నెల రోజుల పాటు కఠోర ఉపవాస దీక్షలు చేసిన ముస్లిం సోదరులు, దీక్షలు విరమించి రంజాన్ పండుగను అత్యంత వైభవంగా నిర్వహించు కున్నారు.ఈ సందర్భంగా మసీదులను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. మసీదుల వద్ద ఏర్పాటుచేసిన ప్రత్యేక నమాజులకు పెద్ద ఎత్తున ముస్లిం సోదరులు హాజరయ్యారు. ఒకరిని ఒకరు ఆప్యాయం గా ఆలింగనం చేసుకుంటూ రంజాన్ శుభా కాంక్షలు తెలుపుకున్నారు. మత సామ రస్యానికి, సోదర భావానికి ఈద్-ఉల్-ఫితర్ పండుగ ప్రతీకగా నిలుస్తుందని అందరూ భావిస్తారు.ఈ సందర్భంగా ఉదయాన్నే పిల్లలు పెద్దలు మసీదులకు వెళ్లి ఆయా గ్రామాల పేష్ ఇమామ్ ల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సర్వ మానవ సమానత్వాన్ని, ప్రేమాభిమానాలను పెంపొందించేది రంజాన్ అని మసీదులలో పలువురు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ మాసంలో ధనిక పేద తేడా లేకుండా రాగద్వేషాలు విడిచి సోదర భావంతో మెలగాలన్నారు. క్రమశిక్షణ,ధాతృత్వం, ధార్మిక చింతనల కలయికే రంజాన్ పండుగ అన్నారు. పవిత్రతకు త్యాగానికి సోదర భావానికి చిహ్నమైన ఇస్లాం జీవన విధానమని అల్లాహ్ దయతో అందరి జీవితాలు ఆనందం వెల్లి విరియాలని ఆకాంక్షించారు. సర్వ మానవాళికి ముక్తి మార్గాన్ని చూపించేందుకు దైవం పంపిన ఖురాన్ షరీఫ్ గ్రంథం ఈ మాసంలోనే అవతరించిందన్నారు. రంజాన్ పండుగ పవిత్రతకు త్యాగానికి చిహ్నమన్నారు. ప్రతి ఒక్కరూ అల్లా కరుణ కటాక్షాలు పొందాలని లక్ష్యంతో రంజాన్ మాసంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తూ బీద ధనిక అనే తారతమ్యం లేకుండా ప్రతి ఒక్కరూ తమకు ఉన్నదానిలో దానధర్మాలు చేస్తూ సేవా దృక్పథానికి సహనానికి ప్రతీకగా ఈ పండుగను జరుపుకుంటారని తెలిపారు. ప్రవక్త బోధించిన బోధనలను తూచా తప్పకుండా పాటిస్తూ ఇస్లాం ధర్మాలను ఆచరిస్తూ, దానధర్మాలు చేస్తూ పేదలను ఆదుకోవాలని కోరారు.

ఆసిఫ్ గెలుపు ఖాయం

- వైసిపి రాష్ట్ర నాయకులు ఆకుల శ్రీనివాస్ కుమార్ తో వంగవీటి నరేంద్ర భేటీ

విశాలాంధ్ర-విజయవాడ (వన్ టౌన్) : రానున్న ఎన్నికల్లో విజయవాడ పశ్చిమ నియోజకవర్గం వైసీపీ అభ్యర్థి ఆసిఫ్ గెలుపు ఖాయమని, ఈ మేరకు తాము అన్ని డివిజన్ల లో పర్యటించి ఓటర్లను చైతన్యవంతం చేస్తామని వైసిపి రాష్ట్ర నాయకులు ఆకుల శ్రీనివాస్ కుమార్, రాష్ట్ర రాధా రంగా మిత్రమండలి అధ్యక్షులు వంగవీటి నరేంద్ర చెప్పారు. గురువారం భవానిపురంలోని ఆకుల శ్రీనివాస్ కుమార్ ఇంటికి వచ్చిన వంగవీటి నరేంద్ర ఆయనతో భేటీ అయ్యారు. పలు విషయాలపై నాయకులు ఇరువురు చర్చించారు. పశ్చిమ నియోజకవర్గంలో భారీ మెజారిటీతో ఆసిఫ్ ను గెలిపించేందుకు గల అన్ని అంశాలపై వారు క్షుణ్ణంగా చర్చించుకోవడం జరిగింది. సీఎం జగనన్న పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమం రెండు కళ్ళుగా ప్రజల కోసం జరుగుతున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని వారు నిర్ణయించారు. పశ్చిమ నియోజకవర్గంలోని అన్ని డివిజన్ల లో విస్తృతంగా పర్యటించి ఓటర్లను వైసిపి కి ఓట్లు వేసే విధంగా తగిన కార్యాచరణను రూపొందించు కోవాలని నాయకులు చర్చలు జరపడం జరిగింది . ఈ సమావేశంలో వైసీపీ నాయకులు అల్లం పూర్ణచంద్రరావు, పొదిలి చంటిబాబు తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు వెన్నుదన్నుగా సీఎం జగన్

విశాలాంధ్ర-జగ్గయ్యపేట : సమాజంలో వెనుకబడిన కులాలకు వెన్నుదన్నుగా నిలిచిన నేత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని జగ్గయ్యపేట నియోజకవర్గ బీసీ నేతలు పేర్కొన్నారు. పట్టణంలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు జగ్గయ్యపేట నియోజకవర్గ బీసీ నేతలు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలో లేని విధంగా వెనుకబడిన కులాల నుంచి ప్రతి వర్గాన్ని గుర్తించి, కార్పొరేషన్లు ఏర్పాటు చేసిన నాయకుడు సీఎం జగన్మోహన్ రెడ్డి అని కొనియాడారు. అలాగే జగ్గయ్యపేట నియోజకవర్గంలో ప్రభుత్వవిప్ శాసనసభ్యులు సామినేని ఉదయభాను బీసీ లకు అత్యధిక ప్రాధాన్యతని ఇచ్చారని తెలిపారు. బీసీలలో ప్రతి వర్గాన్ని గుర్తించి అనేక పదవులు కేటాయించి వారి అభ్యున్నతికి కృషి చేశారని చెప్పారు. వారికి కృతజ్ఞతగా ఈనెల 15వ తేదీ సాయంత్రం 4 గంటలకు జగ్గయ్యపేట పట్టణంలోని కళాశాల ఆవరణలో బీసీ ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి జగ్గయ్యపేట నియోజకవర్గంలోని ప్రతి ఒక్క బీసీ సోదరీ సోదరీమణులు పాల్గొనవలసిందిగా వారు కోరారు.

మసీదుకు రూ.20 వేలు విరాళం

విశాలాంధ్ర-కంచికచర్ల : పట్టణంలో వసంత కాలనీ లోగల మసీదు కు 20 వేల రూపాయలు విరాళాన్ని పట్టణ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఉపసర్పంచ్ వేమా సురేష్ బాబు అందించడం జరిగింది.రంజాన్ పండుగ సందర్భంగా వసంత కాలనీ ముస్లీం సోదరుల ఆహ్వానం మేరకు మసీదు ను సందర్శించగా ముస్లీం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.అనంతరం వారు తమ సమస్యలను వేమా సురేష్ బాబు కు విన్నవించారు. తక్షణమే అయిన స్పందించి ఇప్పుడు ఎలక్షన్ సమయం కనుక ఆ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళ్లడం జరుగుతుందని అప్పటి వరకు నాకు చేతనైన సహాయం అందిస్తామని మాట ఇవ్వడమే కాకుండా వెంటనే స్పందించి 20 వేల రూపాయలు విరాళాన్ని మసీదు మత పెద్దలకు అందజేయడం జరిగింది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముస్లిం సోదరులు, మసీదు మత పెద్దలు, యం డి షబ్బీర్, షేక్ రజీమ్, షేక్ మౌలాలి, షేక్ నాగులు మీరా, షేక్ సుభనీ, షేక్ ఖాసిం, షేక్ రాజక్ తదితరులు పాల్గొన్నారు.

జ్యోతిబాపూలే జయంతి

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: మహాత్మా జ్యోతిబా పూలే జయంతిని పురస్కరించుకుని దళితసంఘాల నేతలు గురువారం ఆయనకు ఘనంగా నివాళు లర్పించారు. బహుజన దళితసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో స్థానిక రెడ్డిగూడెం రోడ్డులోని జ్యోతిబాపూలే, సావిత్రీబాయి పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి, నిమ్నవర్గాలు, మహిళల విద్యావ్యాప్తికి ఆయన చేసిన కృషిని వివరించారు. కార్యక్రమంలో వేదిక అధ్యక్ష, కార్యదర్శులు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, కొండా రాజ్‌కుమార్, సభ్యులు గొర్రె లాజరస్, పల్లిపాం లక్ష్మయ్య, డా.పి.విజయ్, జె.టి.రాజేంద్రప్రసాద్, డి.హరినాధ్, బోణం మహేశ్వరరావు, లకుం పవన్, జి.వెంకటస్వామి, డా.వీర్ల కిరణ్, వి.నాగరాజు, ఎ.మల్లయ్యస్వామి, కోలేటి రంగారావు, ధనరాజు, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహాత్మ పూలే జయంతి

విశాలాంధ్ర - విజయవాడ (వన్ టౌన్) : మహాత్మ పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించిన బి ఆర్ టి ఎస్ వాకర్స్ క్లబ్,డాక్టర్ బ్రహ్మ దేశం సోషల్ సర్వీస్ సొసైటీ,బి సి సంఘం ఆధ్వర్యం లో స్తానిక బావాజీ పేట నిర్వహించారు. తొలుత పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించిన వాకర్స్ డిప్యూటీ గవర్నర్ డాక్టర్ బ్రహ్మ దేశం వసంత కుమార్,బీసీ నాయకులు విరంకి గోకర్ణేశ్వర రావు.ఈ సందర్భముగా వీరంకి గోకర్ణేశ్వర రావు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు పూలే చేసిన సేవలు కొనియాడారు. అనంతరం పాద ఛారులకు చల్లని మజ్జిగ,పండ్లు పంపిణీ చేశారు,ఈ కార్యక్రమం లో వాకర్ నాయకులు కొండాయ గుంట రాము,గుర్రం ఏడు కొండలు,బి,సీతా రామయ్య, నాగ మల్లీశ్వరి,హేమంత రావు, లోకేష్, రమేష్, ఏసు పాదం,పి, సాయి,రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రంజాన్ వేడుకలు

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని విస్సన్నపేటలో ముస్లిం సోదరులు గురువారం ఘనంగా వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉదయం మసీదు కమిటీ ఆధ్వర్యంలో ముస్లిం సోదరులు హాజరై, స్థానిక ఈద్గా మైదానంలో ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. అనంతరం ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటూ, కుటుంబసభ్యులతో ఆహ్లాదంగా గడిపారు.

కరుణ, దాతృత్వానికి ప్రతీక.. రంజాన్

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు: పెనుగంచిప్రోలు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చింతల వెంకట సీతారామయ్య ఆధ్వర్యంలోముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు స్థానిక మసీదు నందు బుధవారం కార్యక్రమం జరిగింది ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపినారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ పండుగ సామరస్యా నికి, సు హృ దృ వానికి, సర్వమా నవ సమానత్వానికి,కరుణ కు, దా తృ త్వా నికి ప్రతీక.. రంజాన్ పండుగ అని తెలిపారు.ఈ కార్యక్రమంలో తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం మాజీ చైర్మన్ కర్ల వెంకట నారాయణ.మాజీ జెడ్పిటిసి గజ్జి కృష్ణమూర్తి.మాజీ సర్పంచ్ జిల్లేపల్లి సుధీర్ బాబు గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కొత్తపల్లి సతీష్ కుమార్.నూతల పార్టీ కృష్ణ. కర్ల నాగేశ్వరరావు నల్లపునేని కొండ.లగడపాటి ప్రవీణ్ చుంచు రమేష్ బాబు. పెనుగొండ గోపాలరావు మాదినేని విక్రమ్ మాదినేని వెంకట్రావు ,గింజుపల్లి వసంతరావు. కందిమళ్ళ. హనుమాంతురావు. బోవనారి. సుభారావు. ముళ్లపాటి. రాము.కంచిపోగు రవి.కర్ల కోటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

వీరులపాడు మండలంలో ఘనంగా రంజాన్ వేడుకలు

విశాలాంధ్ర-వీరులపాడు : పవిత్ర రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని వీరులపాడు మండలంలో అన్నిగ్రామాలలోని మసీదుల యందు ప్రత్యేక ప్రార్థనలు గురువారం నిర్వహించారు. మండలంలోని వీరులపాడు, జుజ్జూరు గ్రామాలలో ఈద్గా మరియు మసీదులలో ప్రత్యేక ప్రార్థనలో ముస్లింలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.జుజ్జూరు గ్రామంలో ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన అనంతరం మసీదు గురువు మహ్మద్ రహీల్ రాజ మాట్లాడుతూ ఖురాన్ బోధనల ప్రభావం సమాజంపై ఎంతగానో ఉంటుందని, రంజాన్ మాసంలో చేపట్టిన ఉపవాస దీక్షలు స్వీయ క్రమశిక్షణ, జీవితంపట్ల సానకూల దృక్పథాన్ని కలిగిస్తాయన్నారు.సహనం, పరోపకారం, త్యాగం వంటి మానవీయ విలువలు రంజాన్ మాసం పెంపొందిస్తుందని పేర్కొన్నారు.పవిత్ర గ్రంథం ఖురాన్ ఉద్భవించిన మాసంలో ముస్లింలు అనుసరించే కఠోర ఉపవాస దీక్షలు, క్రమశిక్షణతో నిర్వహించే ప్రార్థనలు, జకాత్, ఫిత్రా పేరుతో పేదలకు చేసే దానధర్మాలు

పూలే ఆశయ సాధనలో ముందుకు పోదాం

విశాలాంధ్ర-జగ్గయ్యపేట : సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి పోరాడిన నవయుగ వైతాళికుడు సంఘసంస్కర్త జ్యోతిరావు పూలే ఆశయ సాధనలో మనం అంతా ముందుకు వెళ్దామని ప్రభుత్వవిప్,శాసనసభ్యులు సామినేని ఉదయభాను పేర్కొన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు పట్టణంలోని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా స్థానిక విజయవాడ రోడ్డు కమల సెంటర్ నందు ఉన్న ఆయన విగ్రహానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వవిప్,జగ్గయ్యపేట నియోజకవర్గ శాసనసభ సభ్యులు సామినేని ఉదయభాను పలువురు బీసీ నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి,అభివృద్ధికి నిరంతరం కృషిచేసి వారి పురోభివృద్ధికి బాటలు వేసిన మహెూన్నత వ్యక్తి పూలే అని కొనియాడారు.ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బి.డి. ఇండియా సహకారంతో 'ఎయిమ్ ఫర్ సేఫ్టీ' ఇనిషియేటివ్‌ను నిర్వహించిన మణిపాల్ హాస్పిటల్ (విజయవాడ)

-నర్సింగ్ సిబ్బందికి అధునాతన భద్రతా చర్యల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శిక్షణ

విశాలాంధ్ర విజయవాడ ఎడ్యుకేషన్: ఆసుపత్రి సిబ్బందిలో భద్రతపై అవగాహన పెంచేందుకు "ఎయిమ్ ఫర్ సేఫ్టీ" కార్యక్రమాన్ని బెక్టన్ డికిన్సన్ ఇండియాతో కలిసి మణిపాల్ హాస్పిటల్ (విజయవాడ) నిర్వహించింది. ఈ కార్యక్రమంలో దాదాపు 250 మంది నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు. మణిపాల్ హాస్పిటల్ (విజయవాడ) కు చెందిన క్లస్టర్ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ కంటిపూడి, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఉత్తమ్ శర్మ, నర్సింగ్ సూపరింటెండెంట్ శ్రీమతి బి వసంత, జనరల్ ఫిజిషియన్ డాక్టర్ మనోజ్ కుమార్, ఇంటెన్సివిస్ట్ డాక్టర్ శ్రీనివాస్ రావు టి, మైక్రోబయాలజిస్ట్ డాక్టర్ పి శిరీష ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అధునాతన భద్రతా చర్యలు, ఈ దిశలో తీసుకోవలసిన జాగ్రత్తలపై నర్సింగ్ సిబ్బందికి శిక్షణ ఇవ్వడం లక్ష్యంగా ఈ కార్యక్రమం జరిగింది.సాంకేతిక పురోగతులు, వినూత్న సంరక్షణ విధానాలు, ప్రపంచ సంఘటనల ప్రభావంతో నర్సింగ్ రంగం నిరంతరం రూపాంతరం చెందుతోంది. అధిక-నాణ్యత సంరక్షణను అందించడానికి, నర్సులతో సహా ఆరోగ్య సంరక్షణ నిపుణులు అభివృద్ధి చెందుతున్న పరిశ్రమ పోకడలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉండా లి. అందుకే విజయవాడలోని మణిపాల్ హాస్పిటల్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించింది. ఈ సందర్భంగా విజయవాడలోని మణిపాల్ హాస్పిటల్ క్లస్టర్ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ కంటిపూడి మాట్లాడు తూ, "మనం ఎప్పటికప్పుడు మారుతున్న ఆరోగ్యసంరక్షణ రంగంలో ప్రయాణిస్తున్న తరుణంలో, విజయ వాడ లోని మణిపాల్ హాస్పిటల్‌లో భద్రతకు ప్రాధాన్యతనిస్తూ, ఈ పరిశ్రమను తీర్చిదిద్దుతున్న ఆవిష్కరణ లను స్వాగతిస్తున్నాం. 'ఎయిమ్ ఫర్ సేఫ్టీ' ప్రోగ్రామ్ కోసం బెక్టన్ డికిన్‌సన్ ఇండియాతో మా భాగస్వామ్యం మా సిబ్బంది, రోగుల ఆరోగ్యం మరియు భద్రతను రక్షించడంలో మా అంకితభావాన్ని ప్రదర్శిస్తుంది. ఈ కార్యక్రమం ద్వారా మేం మా నర్సింగ్ బృందానికి తాజా పురోగతులు, జాగ్రత్తల గురించి అవగాహన కల్పి స్తాం. ఎప్పటికప్పుడు అభివృద్ధి చెందుతున్న ఆరోగ్య సంరక్షణ వాతావరణంలో అత్యున్నత ప్రమాణాల సంరక్షణను అందించడానికి వారికి సాధికారత కల్పిస్తాం. ప్రస్తుత ట్రెండ్‌లతో తాజాగా ఉండటం మరియు ఆవిష్కరణలను స్వీకరించడం ద్వారా, మా కమ్యూనిటీకి అసాధారణమైన ఆరోగ్య సంరక్షణ సేవలను అందించే మా మిషన్‌ను మేము కొనసాగించగలమని నమ్ముతున్నాం" అని అన్నారు.విజయవాడలోని మణిపాల్ హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ డా.ఉత్తమ్ శర్మ మాట్లాడుతూ, "మా సంస్థలో భద్రత, శ్రేష్ఠత యొక్క సంస్కృతిని పెంపొందించడానికి మేం ప్రగాఢంగా కట్టుబడి ఉన్నాం. బెక్టన్ డికిన్సన్ ఇండియా భాగస్వామ్యంతో నిర్వహిస్తున్న 'ఎయిమ్ ఫర్ సేఫ్టీ' కార్యక్రమం, రోగులు మరియు సిబ్బందికి అత్యున్నత ప్రమాణాల సంరక్షణ భరోసాకు సంబంధించి మీ అంకితభావాన్ని ఒక ఉదాహరణగా చూపుతుంది" అని అన్నారు. .అధునాతన శిక్షణను అందించడం, భద్రతా చర్యల ప్రాముఖ్యతను నొక్కి చెప్పడం ద్వారా, సరైన ఆరోగ్య సంరక్షణ ఫలితాలను అందించడానికి మా నర్సింగ్ బృందానికి మేం సాధికారత కల్పిస్తాం. మేమంతా కలసి మారుతున్న ఆరోగ్య సంరక్షణ స్థితిగతులకు అనుగుణంగా కొనసాగుతాం. రోగుల భద్రత, సంరక్షణ నాణ్యతను మెరుగుపరచడానికి ఆవిష్కరణలు, ఉత్తమ అభ్యాసాలను మెరుగుపరుస్తాం" అని అన్నారు. జ్యోతి ప్రజ్వలనతో ఈ కార్యక్రమం ప్రారంభమైంది. అనంతరం, క్లస్టర్ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ కంటిపూడి ప్రారంభోపన్యాసం చేశారు. అనంతరం డాక్టర్ ఉత్తమ్ శర్మ - మెడికల్ సూపరింటెండెంట్, డా. టి శ్రీనివాస్ రావు - ఇంటెన్సివిస్ట్, డా.పి. శిరీష - మైక్రోబయాలజిస్ట్, డా. సిహెచ్ మనోజ్ కుమార్ - జనరల్ ఫిజిషియన్, శ్రీ బి. సతీష్ కుమార్ - బిడి మేనేజర్, శ్రీమతి బి. వసంత - నర్సింగ్ సూపరింటెండెంట్ తమ సందేశాలను అందించారు.మణిపాల్ హాస్పిటల్ (విజయవాడ) నర్సింగ్ సూపరింటెండెంట్ శ్రీమతి బి వసంత ఈ సందర్భంగా మాట్లాడు తూ, "బెక్టన్ డికిన్సన్ ఇండియా సహకారంతో 'ఎయిమ్ ఫర్ సేఫ్టీ' కార్యక్రమంలో భాగమైనందుకు మేం సంతోషిస్తున్నాం. అధునాతన భద్రతా చర్యలు, ప్రోటోకాల్‌ల పరిజ్ఞానంతో మా నర్సింగ్ బృందాన్ని సన్నద్ధం చేయడం ద్వారా మా రోగులు, సిబ్బంది ఇద్దరి శ్రేయస్సును నిర్ధారించడంపై మా ప్రాథమిక దృష్టి ఉంటుంది. ప్రస్తుత ట్రెండ్‌లకు అనుగుణంగా ఆవిష్కరణలను స్వీకరించడం ద్వారా, ఎప్పటికప్పుడు అభివృద్ధి చెందుతున్న ఆరోగ్య సంరక్షణ వాతావరణంలో అధిక-నాణ్యత సంరక్షణను అందించే మా సామర్థ్యా న్ని మేం మెరుగుపరుస్తాం. ఈ కార్యక్రమం ద్వారా, మా నర్సింగ్ విభాగంలో నిరంతర అభివృద్ధి, ఆవిష్కరణల సంస్కృతిని పెంపొందించడం ద్వారా శ్రేష్ఠత, రోగి భద్రత పట్ల మా నిబద్ధతను మేం పునరుద్ఘాటిస్తున్నాం" అని అన్నారు.

నగరంలో హీరో నవదీప్ సందడి

విశాలాంధ్ర, విజయవాడ ,(గాంధీనగర్): నగరంలో హీరో నవదీప్ సందడి చేశారు. లవ్ మౌళి చిత్రం ప్రమోషన్ లో భాగంగా గురువారం గాంధీనగర్ లోని రాజ్, యువరాజ్ థియేటర్ లో చిత్ర యూనిట్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసింది. ఈ సమావేశంలో హీరో నవదీప్ మాట్లాడుతూ.. లవ్ మౌళి చిత్రం ఈనెల 19న విడుదల కానుందని ఇందులో భాగంగా ప్రమోషన్ కార్యక్రమం విజయవాడ నగరం నుంచి ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. సినిమాకు సంబంధించి ట్రైలర్ను విజయవాడ నగరంలో రిలీజ్ చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్ కు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. ఈ చిత్రంలో తన క్యారెక్టర్ చాలా భిన్నంగా ఉంటుందని తెలిపారు. ఇప్పటివరకు వచ్చిన ప్రేమ చిత్రాలు వేరు ఈ చిత్ర కథాంశం వేరని, యువతను ఈ చిత్రం కచ్చితంగా ఆకట్టుకుంటుందన్నారు... ప్రేమంటే ఏంటో తెలియని ఒక యువకుడికి ప్రేమ మాధుర్యం ఏంటో చాటి చెప్పే చిత్రం అని ఆయన వివరించారు.ప్రతి యువకుడికి నిజజీవితంలో జరిగే సన్నివేశాలు ఈ చిత్రంలో ఉంటాయన్నారు. సినిమా 99 శాతం షూటింగ్ మేఘాలయ రాష్ట్రంలోనే చేసామని అసలు మన ఇండియాలో ఆ రేంజ్ లొకేషన్స్ ఉన్నాయా అని ఆశ్చర్యపోయామన్నారు . అక్కడ ఫస్ట్ షూట్ చేసిన తెలుగు సినిమా ఇదేఅని చెప్పారు.బాలీవుడ్ ఒక సినిమా చేసింది. తమిళ్ లో రెండు మూడు సినిమాలు మేఘాలయాలో కొన్ని ప్రదేశాల్లో కొంత భాగం షూట్ చేసాయి. కానీ మొత్తం సినిమా షూట్ మేఘాలయాలో ఇండియా వైడ్ చూసుకున్నా మాదే మొదటి సినిమా అని తెలిపారు. ఈ చిత్రంలో ప్రముఖ సినీ గేయ రచయిత అనంత శ్రీరామ్ రాసిన పాటలకు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. ఈ ప్రేక్షకులు తప్పక వీక్షించి ఆదరించాలని ఆయన కోరారు. అనంతరం హీరోయిన్ ఫంకూరి గిద్వానీ మాట్లాడుతూ తెలుగులో తాను నటించిన మొదటి చిత్రం లవ్ మౌళి అని ఈ చిత్రంలో తన క్యారెక్టర్ ప్రేక్షకులకు నచ్చుతుందన్నారు. హీరో హీరోయిన్స్ మధ్య వచ్చే రొమాన్స్ సన్నివేశాలు ప్రేక్షకులను రంజింపచేస్తాయన్నారు. అనంతరం సినీ గేయ రచయిత అనంత్ శ్రీరామ్ మాట్లాడుతూ దర్శకుడు అవనీంద్ర కోరిక మేరకు మేఘాలయకు వెళ్లడం జరిగిందని ఈ చిత్రానికి సంబంధించిన పాటలన్నీ ఆ ప్రాంతంలోనే రచించినట్లు చెప్పారు. ప్రతి పాట ప్రేక్షకుడి హృదయాన్ని హత్తుకునే విధంగా ఉంటుందన్నారు. దర్శకుడు తో పాటు తాను ప్రతి లొకేషన్ కు వెళ్లడం జరిగిందని ప్రతి సన్నివేశాన్ని దర్శకుడు చాలా చక్కగా చిత్రీకరించారని ఈ చిత్రం తప్పక విజయం సాధిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. తదనంతరం నటి భావన మాట్లాడుతూ లవ్ మౌళి చిత్రంలో తాను హారిక అనే క్యారెక్టర్ లో నటించానని తనకు హీరో నవదీప్ కు మధ్య జరిగే రొమాన్స్ సన్నివేశాలు ప్రేక్షకులను ఉరూతలు ఇస్తాయని ఆమె పేర్కొన్నారు.

ఇళ్లస్థలాల సమస్య పరిష్కరిస్తాం : యార్లగడ్డ

విశాలాంధ్ర-ఉంగుటూరు : టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మానికొండ గ్రామంలో ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించి అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు పంపిణీ చేస్తామని గన్నవరం నియోజకవర్గ టిడిపి, జనసేన, బిజెపి, కూటమి అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు సోదరుడు సతీష్ ఇళ్లులేని పేదలకు హామీ ఇచ్చారు. గురువారం సాయంత్రం గ్రామంలో గడపగడపకు ప్రజాగళం కార్యక్రమంలో బిజెపి, టిడిపి, జనసేన నాయకులతోను తన భార్య లక్ష్మీతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని వీధుల్లో పర్యటిస్తూ ఇంటింటికి వెళ్లి టిడిపి ఎన్నికల మేనిఫెస్టోను గన్నవరం నియోజకవర్గ అభివృద్ధికి తన సోదరుడు వెంకట్రావు చేపట్టబోయే సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలు సతీష్ పంపిణీ చేశారు. గ్రామంలో ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారం కాలేదని మరో రెండు నెలలు ఓపిక పడితే తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని ఆ వెంటనే అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇస్తామన్నారు. గ్రామంలో ధ్వంసమైన అంతర్గత రహదారులను అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్న ఆయన వీటిని తన సోదరుడు వెంకట్రావ్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. అభివృద్ధి సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అధికారం చేపడితేనే రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తుందని రాష్ట్ర ప్రజలందరూ కూటమి అభ్యర్థులకు ఓట్లు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. గన్నవరం నియోజకవర్గం అభివృద్ధికి అహర్నిశలు పరితపిస్తున్న తన సోదరుడు వెంకట్రావ్ కు సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని సతీష్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ఆరుమల్ల వెంకటకృష్ణారెడ్డి, మండల మహిళా అధ్యక్షురాలు మండవ రమ్య ,గ్రామ పార్టీ అధ్యక్షులు ఎడ్లపల్లి సాయి యూనిట్ ఇంచార్జ్ ఆరికట్ల రవికుమార్, రాజ్ కుమార్, గ్రామ పార్టీ ఉపాధ్యక్షులు బెజవాడ నాగేశ్వరరావు, లాబాను, దాదా, వారికూటి కిషోర్, బువనేష్,రవి చంద్, నూతక్కి బెనర్జీ,ప్రకాష్, తాతినేని పార్వతి, రసూల్, ఝాన్సీ,తదితరులు పాల్గొన్నారు

నకిలీ వీడియోలతో జాగ్రత్త

విశాలాంధ్ర - విజయవాడ (వన్ టౌన్): నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఎండీ, సీఈవో ఆశిష్‌కుమార్ చౌహాన్ ముఖం, గొంతును అనుకరిస్తూ, ఎన్ఎస్ఈ లోగో కూడా ఉపయోగించి సాంకేతికత సహాయంతో తప్పుగా సృష్టించబడిన కొన్ని పెట్టుబడి సలహాలను ఆడియో, వీడియో క్లిప్‌లలో ఉపయోగించినట్లుగా గమనించినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ తరహా నకిలీ వీడియో సిఫారసుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వారు పేర్కొన్నారు. ఆశిష్‌కుమార్ చౌహాన్ స్వరం, ముఖ కవళికలను అనుకరించడానికి అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఇటువంటి వీడియోలు సృష్టించబడినట్లు కనిపిస్తోంది. అటువంటి ఆడియో, వీడియోలను నమ్మవద్దని, అటువంటి నకిలీ వీడియోలు లేదా ఇతర మాధ్యమాల నుండి వచ్చే పెట్టుబడి లేదా ఇతర సలహాలను అనుసరించవద్దని పెట్టుబడిదారులకు తెలియజేశారు. ఎన్ఎస్ఈ ఉద్యోగులు ఎలాంటి స్టాక్‌లను సిఫార్సు చేయడం, ఆ స్టాక్స్ లో డీల్స్ గురించి తెలపటానికి ఎలాంటి అధికారం కలిగి ఉండరని గమనించవలసినదిగా మనవి చేశారు.

వ్యాపార సుస్థిరతపై ప్రత్యేక దృష్టి పెట్టే ఫ్లెక్సీ-క్యాప్ పోర్ట్‌ఫోలియో

విశాలాంధ్ర - విజయవాడ (వన్ టౌన్): చాలా కాలంగా ఫ్లెక్సీ క్యాప్ ఫండ్స్ విభాగంలో కార్యకలాపాలు సాగిస్తున్న ఫండ్స్‌లో యూటీఐ ఫ్లెక్సీ క్యాప్ ఫండ్ కూడా ఒకటి. స్థిరమైన పనితీరు కనపర్చడంలో దీనికి దీర్ఘకాలంగా ట్రాక్ రికార్డు ఉంది. ఈ ఫండ్‌కు రూ. 24,500 కోట్ల నిధి ఉంది. ఇన్వెస్టర్లకు ఆర్థికంగా ప్రయోజనం కలిగించే సామర్థ్యాలు గల నాణ్యమైన వ్యాపారాల్లో ఇది ఇన్వెస్ట్ చేస్తుంది. యూటీఐ మ్యూచువల్ ఫండ్ అందిస్తున్న ఈ ఫండ్ దీర్ఘకాలిక కోణంలో ఆలోచించే ఇన్వెస్టర్లకు అనువైనదిగా ఉంటుంది. యూటీఐ ఫ్లెక్సీ క్యాప్ ఫండ్ యొక్క పెట్టుబడి ధోరణులు ప్రధానంగా నాణ్యత, వృద్ధి, వేల్యుయేషన్ అనే మూడు పునాదులపై ఆధారపడి ఉంటాయి. సుదీర్ఘ కాలం పాటు పటిష్టమైన వృద్ధిని సాధించగలిగే సత్తా కలిగి ఉండి, నైపుణ్యాలు గల మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో పని చేసే వ్యాపారాలపై ఈ పోర్ట్‌ఫోలియో దృష్టి పెడుతుంది.

పుణ్య తీర్థయాత్ర ప్రత్యేక రైలు

విశాలాంధ్ర-విజయవాడ (వన్ టౌన్): భారతీయ రైల్వే భారత్ గౌరవ్ పథకం కింద సేవలను అందించే అత్యంత విజయవంతమైన ప్రైవేట్ రైలు సౌత్ స్టార్ రైలులో ఉలా సేవలు, తమ తదుపరి పర్యటనను ప్రకటించింది. ప్రయాగ్ రాజ్, వారణాసి, గయ, అయోధ్య, హరిద్వార్, ఢిల్లీ, మథుర, ఆగ్రాకి మే 18 నుంచి 29వరకు (12 రోజులు) ఈ యాత్ర కొనసాగుతుంది. భారత దేశ పురాతన సంప్రదాయాలు, దైవత్వం యొక్క సారాంశంతో నిండిన భారతదేశం యొక్క గొప్ప ఆధ్యాత్మిక, సాంస్కృతిక వారసత్వాన్ని సందర్శించడానికి ఒక ప్రత్యేక అవకాశాన్ని అందిస్తుంది. ఖచ్చితంగా రూపొందించబడిన ఈ ప్రయాణం యాత్రికులందరికీ గొప్ప అనుభూతిని అందిస్తుంది. ఈ ప్రత్యేక రైలు కోయంబత్తూరు నుండి బయలుదేరి, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, విజయవాడ, వరంగల్ స్టేషన్లలో పర్యాటకులకు రైలు ప్రయాణం చేసేందుకు వీలు కల్పిస్తున్నారు. దారి పొడువునా యాత్ర విశేషాలను వివరించేందుకు పీఏ సిస్టమ్స్, సీసీటీవీ కెమెరాలు, కోచ్ సెక్యూరిటీ, టూర్ మేనేజర్‌లు, ట్రావెల్ ఇన్సూరెన్స్, వసతి, సందర్శనా, బసు, మూడు పూటల దక్షిణ భారత భోజనం సహా వివిధ రకాల సౌకర్యాలను ఈ రైలు కలిగి ఉంది. యాత్రికులు ఎల్టీసీ, ఎల్ఎఫ్సీ సౌకర్యాన్ని కూడా పొందవచ్చని సంస్థ ప్రతినిధి విఘ్నేష్ తెలిపారు. విచారణలు, బుకింగ్‌ల కోసం 7416718800, 80152 28115లను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

మొవ్వ మండలంలో భక్తిశ్రద్ధలతో రంజాన్ ప్రార్థనలు

విశాలాంధ్ర-కూచిపూడి : గత నెల రోజులుగా కొనసాగుతున్న రంజాన్ ఉపవాస దీక్షలు గురువారంతో ముగిశాయి. రంజాన్ వేడుకలు మొవ్వ మండలంలో ముస్లిం సోదరులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. పెదపూడి, భట్లపెనుమర్రు, మొవ్వ, కోసూరు తురకపాలెం, కాజ, నిడుమోలు లోగల మసీదులలో ఈ వేడుకలు జరుపుకొని ఒకరికొకరు ఈద్ ముబారక్ చెప్పుకున్నారు. ఈ సందర్భంగా కోసూరు తురకపాలెం జామియా మసీదులోఇమామ్ హాఫీజ్ అబ్దుల్ సత్తార్ సాహెబ్ఆధ్వర్యంలో ఈద్- ఉల్‌ఫిత్ర్.నమాజు చేసి అనంతరం ఖురాన్ పఠనం నిర్వహించారు. పెదపూడి మసీదు నుంచి ర్యాలీగా పెదసనగల్లురోడ్ లోని ధర్మాపురం వద్ద నమాజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకలలో చిన్నారుల ఈద్ ముబారక్ పలకరింపులు ఆకర్షణీయంగా నిర్వహించాయి. ఈ వేడుకలలో ఆయా గ్రామాలలోని ముస్లిం సోదరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా పేదలకు మసీదుల వద్ద దానధర్మాలు నిర్వహించారు.

పెదపూడిలో వైసీపీ కార్యాలయం ప్రారంభం.

విశాలాంధ్ర -కూచిపూడి : కూచిపూడి-పెదపూడి గ్రామాలకు సంబంధించిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని బుధవారం రాత్రి మచిలీపట్నం పార్లమెంటు అభ్యర్థిడాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్, పామర్రు నియోజకవర్గ అభ్యర్థి, శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ తిరిగి రెండవసారి అధికారంలోకి రావడానికి నాయకులు, కార్యకర్తలు అత్యంత ప్రతిష్టాత్మకంగా కృషి సల్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు రాజులపాటి రాఘవరావు, జడ్పిటిసి రాజులపాటి పార్వతి, ఎంపీపీ కొండేటి ఇందిర,పిఎసిఎస్ అధ్యక్షురాలు కైలా శ్రీవల్లి తదితరులు పాల్గొన్నారు అంత ముందుగా కూచిపూడి సెంటర్లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాలకు పూలదండలు వేసి నివాళులర్పించారు.

వైసీపీకి అండగా ఉండి ఆశీర్వదించండి

విశాలాంధ్ర-కూచిపూడి : మరొక నెల రోజులలో జరిగే సార్వత్రిక ఎన్నికలలో వైఎస్ఆర్ సిపిని ఆశీర్వదించి మళ్లీ పట్టం కట్టటానికి ప్రజలు అండగా నిలబడాలని పామర్రు ఎమ్మెల్యే, అభ్యర్థి కైలే అనిల్ కుమార్, మచిలీపట్నం పార్లమెంటు అభ్యర్థిగా పోటీ చేస్తున్న డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్ కోరారు. మొవ్వమండలం కూచిపూడి లోని స్టేట్ బ్యాంకు వెనకాల గల ఎస్ ఎస్ ఎల్. (శివరావుగారి)ఫంక్షన్ హాల్ లో బుధవారం రాత్రి నిర్వహించిన మండల స్థాయి సమావేశంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల ప్రజలకు అండగా ఉండి వారి అభ్యున్నతికి గురిచేస్తుందని పేర్కొన్నారు. జగన్మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత కులం మతం చూడకుండా అర్హతనే ప్రామాణికంగా తీసుకొని అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేశారని,ఆయన పాలనలో పేద మధ్యతరగతి కుటుంబాలు చాలా ఆనందంగా ఉన్నాయని పేర్కొన్నారు రాష్ట్రంలో అభివృద్ధి ,సంక్షేమం, విద్య, వైద్యం కొనసాగాలంటేజగనన్నతోనే సాధ్యమని పేర్కొంటూ ప్రజలు తమ మద్దతునిచ్చి ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొండేటి ఇందిర, జడ్పిటిసి రాజులపాటి పార్వతి, మండల పార్టీ అధ్యక్షుడు రాజులపాటి రాఘవరావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు గోగినేని పెరుమాళ్ళు, కాజ ఉపసర్పంచ్ మంద శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీ కందుల వెంకట కోటేశ్వరరావు,పిఎసిఎస్ అధ్యక్షులు కాకర్ల శివకుమార్ (చినముత్తేవి), కైలా శ్రీవల్లి (కూచిపూడి), పలువురు ఎంపీటీసీలు, గ్రామ సర్పంచులు, గ్రామ కమిటీ అధ్యక్షులు మండల స్థాయి నాయకులుతదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ముస్లింలు ఉన్నత స్థానానికి చేరుకోవాలి

విశాలాంధ్ర-అవనిగడ్డ : అల్పాదాయ వర్గాలకు చెందిన ముస్లిం సోదరులు ఉన్నత స్థానానికి చేరుకోవాలని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ కోరారు. గురువారం రంజాన్ పండుగను పురస్కరించుకుని ముస్లీం సోదరులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. హిందు, ముస్లీం సమైక్యతకు అవనిగడ్డ ప్రతీక అన్నారు. ముస్లీంలు, హిందువులు మతాతీత భావనతో ఎలాంటి తారతమ్యాలు లేకుండా రెచ్చగొట్టేవారిని పట్టించుకోకుండా సమైక్యంగా ముందుకు సాగాలన్నారు. అవనిగడ్డలో మసీదు అభివృద్ధి, విస్తరణ పనులకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తామని మండలి హామీ ఇచ్చారు. అవనిగడ్డలో ముస్లీంల చిరకాల వాంఛగా ఉన్న ఈద్గా హ ఏర్పాటు కోసం అనువైన స్థలం ఎంపిక చేసి, కేటాయించి అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. అవనిగడ్డ మసీదు నిర్మాణానికి అప్పట్లో నిజాం నవాబు ముని మనువడు మూర్తాంజా విరాళం ఇవ్వడంతో పాటు అవనిగడ్డ వచ్చి మసీదు సందర్శించారని మండలి అన్నారు. అవనిగడ్డ నియోజకవర్గంలో ముస్లీంల సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానన్నారు. ఆయనతో పాటుగా తెలుగుదేశం పార్టీ అవనిగడ్డ మండల పార్టీ అధ్యక్షులు యాసం చిట్టిబాబు, అవనిగడ్డ జనసేన పార్టీ మండలి అధ్యక్షులు గుడివాక శేషుబాబు, ఎం.పి.టి.సి బొప్పన బాబు, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ మైనారిటీ సెల్ నాయకులు షేక్ బాబావలి, మహ్మద్ మురాబ్, వహీదుల్లా, మొగల్ హుస్సేన్ మాజీ ఉపసర్పంచ్ ఘంటశాల కన్నయ్యలతో పాటు పలువురు పాల్గొన్నారు.

దళితులపై సీఎం జగన్ చిన్నచూపు

విశాలాంధ్ర-పెడన: ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దళితుల పట్ల చిన్నచూపు చూస్తున్నారని దళిత నాయకుడు గోపు నాగబాబు అన్నారు. ఈ మేరకు పెడన నియోజవర్గంలో దళిత తేజం, తెలుగుదేశం దళితుల్లో చైతన్యం నింపే దిశగా కృషి చేస్తూ నియోజకవర్గంలో పెడన, గూడూరు, బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల దళిత నాయకులు విస్తృతంగా పర్యటిస్తున్నారు. పెడన మండలం మడక గ్రామంలో గోపు నాగబాబు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం నా ఎస్సీ నా ఎస్టి అని చెబుతూ ఎస్ ఎల్ అనేక అవమానాలకు గురిచేసి అధికారం ఉంది కదా అని డాక్టర్ సుధాకర్ ని అన్యాయంగా అక్రమంగా అరెస్టు చేసి ఆయన చనిపోయే విధంగా పోలీసులతో ప్రవర్తింప చేయించి ఆయన చివరగా చనిపోవడం జరిగిందని అన్నారు. ఆయనతోపాటు నాలుగు మండలాల దళిత నాయకులు పాల్గొని దళిత గ్రామాల్లో వైసిపి ప్రభుత్వానికి ఎందుకు ఓటు వేయకూడదో వివరించారు. ఈ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అవ్వాలని , పవన్ కళ్యాణ్ నరేంద్ర మోడీ నాయకత్వంలో ఈ రాష్ట్రానికి మేలు జరుగుతుందని దళిత నాయకులు పేర్కొన్నారు. కావున మనమందరం దళిత తేజం అనే నినాదంతో రేపు రానున్న రోజుల్లో తెలుగుదేశం బిజెపి బలపరిచిన జనసేన బందర్ పార్లమెంట్ అభ్యర్థి వల్లభనేని బాలశౌరి కి గాజు గ్లాస్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అలాగే పెడన నియోజకవర్గ జనసేన బిజెపి బలపరిచిన అభ్యర్థి కాగిత కృష్ణ ప్రసాద్ కి సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని దళిత నాయకులు కోరారు.. ఈ కార్యక్రమంలో పెడన పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కమ్మగంటి వెంకటేశ్వరరావు, (బాబు) కటికెన.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

చల్లపల్లిలో ఘనంగా రంజాన్

విశాలాంధ్ర - చల్లపల్లి : చల్లపల్లిలో ముస్లిం సోదరులు గురువారం ఈదుల్ ఫితర్ (రంజాన్) పర్వదిన వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. చల్లపల్లిలోని ఈద్గా మైదానంలో చల్లపల్లి, నారాయణరావు నగర్, లక్ష్మీపురం గ్రామాల ముస్లిం సోదరులు వందలాది మంది తరలివచ్చి ఖురాన్ గురువు సమక్షంలో రంజాన్ ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. అనంతరం పరస్పరం ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు పంచుకున్నారు.

యలమర్రులో మన ఇంటికి మన కైలే

విశాలాంధ్ర పెదపారుపూడి : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని ఆదరించి మరొక పర్యాయం వైయస్ జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా చేయాలని పామర్రు శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ మన ఇంటికి మన కైలే అనే కార్యక్రమం లో భాగంగా ఇంటి ఇంటికి తిరుగుతూ ఇప్పటివరకు అందించిన సంక్షేమ పథకాలను వివరిస్తూ, ప్రజా సేవ చేయటానికి మరొక అవకాశం కల్పించాలని ఓటర్లను ముందుకు సాగారు. ఈ విషయమై ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలో జరగబోతున్న సార్వత్రిక ఎన్నికలలో మచిలీపట్నం వైసీపీ పార్లమెంట్ అభ్యర్థిగా సింహాద్రి చంద్రశేఖర్ కు మరొకటి పామర్రు ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న తనకు రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి గతంలో కంటే అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను ప్రాధేయపడి వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గోగం సురేష్, వైసీపీ సేవా విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గోళ్ల సోమేశ్వరరావు, పిఎసిఎస్ సొసైటీ అధ్యక్షుడు మూల్పూరి నరేంద్ర, మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ గోళ్ల వెంకటేశ్వరరావు, నాయకులు కంభం డేవిడ్, చిగురుపాటి శ్రీధర్, నామ వెంకటేశ్వరరావు, మండల గ్రామ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామంలో ప్రశాంతత నెలకొల్పుదాం : ఎస్ఐ శ్రీనివాస్

విశాలాంధ్ర-పమిడిముక్కల: రానున్న ఎన్నికలు దృష్ట్యా గ్రామాల్లో ప్రశాంతత వాతావరణం నెలకొనేలా చర్యలు తీసుకుంటున్నామని దానిలో భాగంగా ప్రతి గ్రామంలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.గురువారం ఐనపూరు లో ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున నగదు రవాణా చేయరాదని, అక్రమ మద్యం పేకాట కోడిపందాలు చిత్తులాట లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని, సత్ప్రవర్తన తో మెలగాలని అవగాహన కల్పించారు.